## 19. పర్స్ దొరికింది

పర్స్ దొరికింది - అంటే రెండర్థాలొస్తాయి.

అయితేను; సినిమాల్లో వొచ్చే రెండర్థాల్లాంటివి కాదు.

ఈ రెండర్థాలూ ఏంటంటేనూ.

ఎవరిదో పర్సు మనకి దొరకడం వొకటీనీ; మనదే, పోగొట్టుకున్న పర్స్ మళ్లీ మనకి దొరకడం వొకటీనీ.

రెండూ అరుదుగా జరిగేవే.

నా నిరంతర ప్రయాణాల్లో నాకు చాలా వొస్తువులు దొరుకుతూ వుండడం కద్దు.... ఎందుకు దొరుకుతాయీ అంటే - ఎవరైనా పారేసుకుంటే దొరుకుతాయి; అలా ఎవరైనా పారేసుకున్నాక నాకన్నా ముందుగా ఇంకెవరూ చూడకపోతే దొరుకుతాయి.

ఈ సందర్భంగా రెండు జోకులు గుర్తొస్తాయి.

ఒకాయన రోడ్డు మీద నడుస్తున్నప్పుడు కొద్దిగా ముందుకి వొంగి నడవడమే కాకుండా; తలకూడా కొంచెం వొంచుకుని నడుస్తున్నాడని -

వాళ్ల పొరుగావిడ గమనించిందట.

ఇరుగు పొరుగుల్ని ప్రేమించు అన్నది పాత మాట; ఇరుగు పొరుగుల్ని సాధించు అన్నది కొత్తమాట - కదా. అంచేత ఆవిడ - ఆ పెద్ద మనిషి భార్యతో -

"ఏవండొదినా; మీవారికి అరవై దాటకుండానే గూని వొచ్చేసినట్టుందే పాపం?" అని - కొంచెం సానుభూతీ కొంచెం వేళాకోళం మిళాయించి అందిట.

"గూనీ కాదు వినయమూ కాదు. ఆమధ్యెప్పుడో రోడ్డు మీద నడుస్తూ వుండగా ఓ అర్థరూపాయి దొరికింది కదా. అప్పట్నించీ ఆ వొంగి నడవడం అలవాటైంది; అంతే"

రెండో జోకు కొంచెం విదేశీయం. ఇంగ్లాండు దేశస్థుడు రైలో బస్సో దిగి వెళ్లే ముందు తను ఏమైనా మర్చిపోయేడా అని ఒకటికి రెండుసార్లు చూసుకుంటాడట. అదే స్కాట్లాండు దేశస్థుడైతే ఎవరైనా ఏదైనా మర్చిపోయారా - అని బండంతా వెతికి మరీ దిగుతాట్ట. (ఇది ఇంగ్లాండు వాళ్లు నిర్వచించే విధానం. స్కాట్లాండు వాళ్ల నిర్వచనం సరిగ్గా దీనికి విపర్యయంగా వుంటుందని వేరే చెప్పక్కర్లేదు కదా.)

పోవుట ఖచ్చితంగా దొరుకుట కొరకే. అయితే, ఒకరిది పోవుట ఇంకొకరికి దొరుకుట కొరకే అని వ్యాఖ్యానించుకోవాలి. లా ఆఫ్ కన్సర్వేషన్ ఆఫ్ మేటర్ ప్రకారం ఒకరికి దొరికిందంటే ఇంకొకరిది పోయిందనే కదా అర్థం.

నాలాంటి పెద్దమనుషులు చాలామంది తమకి దొరికిన వస్తువుల్ని వీలైనంతవరకు వాట్ని యెవరైతే పోగొట్టుకున్నారో వారికి వప్పగించే ప్రయత్నమైనా చేస్తారు; కనీసం అలా ఇష్టపడతారు. ఐతే యిది మళ్లాను ఆ దొరికిన వస్తువు యొక్క అసలు విలువ, వినియోగపు విలువ - వీటిని బట్టి కొంత ఆధారపడినా; పోగొట్టుకున్న వ్యక్తి తాలూకు అడ్రసు లభ్యతమీద ఎక్కువ ఆధారపడుతుందని చెప్పాలి. అడ్రసు లేకపోతే ఏమి, ఈ దొరికిన వస్తువు మనది కాదు గనక దీన్ని ఏ పోలీస్టేషన్లోనైనా వప్పగించేస్తే వారే దీని సంగతి చూసుకుంటారు - అని నమ్మేవాళ్ళ సంఖ్య రోజురోజుకీ తగ్గిపోతోందని నా అనుమానం.

నా నిరంతర ప్రయాణాల్లో నాకు దొరుకుతూ వుండడానికి సావకాశం వుండే వస్తువుల స్వభావం ఎటువంటిదనగా; జేబురుమాలు, పెన్సిలు, పెన్ - ముఖ్యంగా కేప్ లేని బాల్ పాయింట్ పెన్ - చదివేసి వొదిలేసిన న్యూస్‌పేపర్లు, వారపత్రికలు - అవీ కొన్ని రకాలు మాత్రమే - మిగతా రకాలు ఎవరూ ఎట్టి పరిస్థితుల్లోనూ వొదలరు. ఇలా దొరికిన వస్తువులు వేటిమీదా కూడాను వాటిని పోగొట్టుకున్న వారి అడ్రస్‌లు వుండవు కనక వాటిని ఆయా వ్యక్తులకు అందజెయ్యలేక ఇంటికి తెచ్చేస్తూ వుంటాను.

ఇంట్లో వాళ్లు - ముఖ్యంగా ఇంటి ఇల్లాలు - "ఇదేదో మనది కాదే; దొరికిన సరుకులా వుందే?" అని కనిపెట్టడం, ఆమేరకి నాచేత కన్‌ఫెషన్ చెప్పించడం జరుగుతూ వుంటుంది.

'మహా దొరికిందిలేండి, ఎల్లా అయితేనేం! ఇల్లాంటి చిల్లరమల్లర సరుకు దొరుకుతుందే తప్పా ఓ సూట్‌కేసో కనీసం ఓ పర్సో దొరకొచ్చుకదా? అంత అదృష్టం కూడానా ఈ మొహానికి?' అని ఒకానొక ఈసడింపురూపంలో - ఒక్కొక్క వస్తువు దొరికినప్పుడల్లా - నా దురదృష్టమాలలో ఒక్కొక్క పువ్వు నానెత్తిమీద పడుతూ వుండడం కూడా వుంది.

అయితేనూ -

మొన్నామధ్య హైద్రాబాద్‌నుంచి నరసారావుపేటకి రాత్రి బస్సులో వచ్చినపుడు - నాకో పర్స్ దొరికింది!

❖ ❖ ❖

ఏదైనా తనదికాని వస్తువు ఒక వ్యక్తికి దొరికినప్పుడు ఆ వ్యక్తి ఏం చేస్తాడు?

చుట్టుపక్కల ఎవరైనా చూస్తున్నారా లేదా అన్నట్టు దొంగచూపులు చూసేసి; (అలా దొరికిన వస్తువు యొక్క సైజుని బట్టి) జేబులోనో సంచిలోనో పెట్టేసుకున్నట్టు - సినిమాల్లోనూ గట్రా చూపిస్తారు.

నేనలా చెయ్యలేదు.

నా సామాను - అంటే వొకసూట్‌కేసు, ఒక జెబ్బ సంచీ - వీటికి ఎడంచేతినీ ఎడం

భుజాన్నీ కేటాయించి; కుడిచేత్తో ఆ పర్స్ పట్టుకుని - తగుమాత్రంగా పైకెత్తి వుంచి; బస్సంతా గిర్రుగా చూసేను. గుర్రుగా కాదు. అదే, కొన్ని ఇంగ్లీషు మాటల్లోనే తప్ప తెలుగు మాటల్లో బోధపడ్డం లేదు ఈమధ్య. (మాటవరసకి ఏదో సంతర్పణకి - అదే, డిన్నర్‌కి లేదా లంచ్‌కి - వెళ్లి భోంచేస్తున్నప్పుడు; కొంచెం అన్నం వెయ్యండీ అంటే అన్నం వెయ్యకపోగా వెర్రి మొహం వేస్తారు. 'వయిట్‌రైస్' వెయ్యండి అంటే 'జస్టే మినిట్'లో తెచ్చివేస్తారు.)

సరే, బస్సంతా గిర్రుగా - అంటే రౌండుగా చూసేక, తెలిసింది. బస్సు నరసరావుపేటకి చేరి ఐదు నిమిషాలైపోయుండొచ్చుని; ఆఖర్ని దిగుతున్నది నేనేనని.

ఈ పర్స్ పోగొట్టుకున్న మనిషి బస్సు దిగడం ఆదుర్దాలో ఈ పర్స్ పోగొట్టు కున్నాడు. బస్సు దిగేక అయినా తను బస్సులో ఏమైనా వదిలేసుకున్నాడా మర్చిపోయాడా అని ఆలోచించకుండా ఏ పల్లెటూరిబస్ కోసమో రిక్షా కోసమో అదే ఆదుర్దాలో వెళ్ళిపో యుండాలి. అలా వెళిపోడమే కాక, అక్కడకూడా తన జేబులు ఓసారి తడుంకోలే దన్నమాట. లేకపోతే "అయ్యో, నా పర్సు! అయ్యో, నా పర్సు!!" అని అరుచుకుంటూ జేబులూ, గుండెలూ బాదుకుంటూ బస్సు దగ్గిరికి పరుగెత్తుకొచ్చేవాడే కదా.

ఈ పర్స్ అసలు వోనరు కనుచూపుమేరలో లేడు. అంచేత దీని తాత్కాలిక ఓనర్ నేనే.

కడుపునిండిన వాడికి నడక మెల్లన. అంచేత - మనిషిగా ఈ పర్స్‌లో ఎంత చరాస్తి వుందనీ; పెద్దమనిషిగా ఇందులో ఎడ్రస్ కాగితం ఏదైనా వుందా అనీ - చూసుకోడానికి ఇదే మంచి సమయం. ఇదే మంచి స్థలం కూడాను. అంచేత, 'బస్సే సౌఖ్యమనే భావన రానీవోయ్' అని పాడుకుంటూ బస్సులోనే ఓ సీట్లో సెటిలయి, ఆ పర్స్ తెరిచి లోపలి విశేషాలు పరిశీలించేను.

దాంట్లో -

ఐదు వందలరూపాయల నోట్లు - ఒక్కటి కూడా లేదు.

వంద రూపాయల నోట్లు - ఒక్కటి కూడా లేదు.

యాభై రూపాయల నోట్లు - ఒక్కటి కూడా లేదు.

ఇరవై రూపాయల నోట్లు - ఒక్కటి కూడా లేదు.

పది రూపాయల నోటు - ఒకటి; రెండు రూపాయలనోటు - ఒకటి; పావలా నాణాలు - రెండు!

దొరక్క దొరక్క ఓ పర్స్ దొరికితే దాంట్లో వంద రూపాయలు కాదుగదా ఓ పాతికైనా లేదు. పూర్వం పాతికో పరకో - అనేవారు. పరక - అంటే పన్నెండున్నర.

ఈ మొహానికి అంతకంటా యేం దొరికి చస్తుంది - అని ఈసడించేవాళ్ళు ఉన్నా సరే - నాకు దొరికింది సరిగ్గా పరకే.

ఇంకొకటుంది గానీ...... చెప్పుకోదగినది కాదు.

అయినా సరే ఈ పరకని గడ్డిపరకగా తీసెయ్యడానికి వీలవలేదు. ఎందుకంటే, పర్స్ పోగొట్టుకున్న వ్యక్తి ఎవరో గాని; ఈ పన్నెండు రూపాయల ఏభై పైసల్ని ఎంత ఖచ్చితంగా వాడుకోదల్చుకున్నాడో ఆ వివరం రాసున్న కాగితం ఒకటి ఆ నోట్లున్న అరలో వుంది. ఆ వివరం ఎలావుందంటేను -

ఇంటినుండి తెచ్చినది : పదిహేను రూపాయలు

గౌలిగుడా డిపోలో చాయ్ : రూపాయిన్నర

సాగర్‌లో చాయ్ : రూపాయి

నరసారావుపేటలో టిఫిన్ వగైరా : రెండు రూపాయల యాభై పైసలు

రాజేశ్వరికి చెల్లించవలసినది : ఐదు రూపాయలు

రిక్షా ఖర్చులు : రెండు రూపాయలు

తిరుగు ప్రయాణంలో చాయ్ వగైరా : మూడు రూపాయలు

పర్స్‌లో మూడో అరలో ... ... అయ్యో పాపం .... కండక్టర్ లైసెన్స్ !

అప్పుడర్థమైంది, ఆపర్స్ పారేసుకున్నదెవరో,

నాలో "మనిషి"ని ఓ గుద్దు గుద్దేసి "పెద్దమనిషి" విజృంభించేడు. "వెంటనే పరుగెత్తుకెళ్ళు. ఆ కండక్టర్‌ని ఎలాగైనా వెతికి పట్టుకో. ఈ పర్స్ అతనికి వప్పగించు. లేకపోతే అతని ఉద్యోగానికే మోసం రావచ్చు!" అన్నాడు.

"అడ్రస్సో?" అన్నాడు మనిషి

"అడ్రస్‌కేముంది? కంట్రోల్ రూమ్‌కెళ్ళి అడుగు. కె.సూర్యనారాయణ; కండక్టర్;"

"అతను ఆ రాజేశ్వరింటికి వెళిపోయాడో ఏమిటో."

"వెళ్ళడు, వెళ్ళేముందు పర్స్ చూసుకుంటాడు కదా. పర్స్ లేకుండా రాజేశ్వరింటికి ఏ మొహం పెట్టుకు వెళ్తాడేం."

చకచకా కంట్రోల్‌రూమ్ వేపు వెళ్ళాను.

అక్కడ ఒక ఆఫీసరు. చుట్టూరా అయిదారు మంది కండక్టర్లూ, డ్రైవర్లూ, ఎస్సార్‌లూ, 'ఎస్.సార్'లూ; ట్రిప్‌షీట్లు; ఛార్ట్‌లూ - అంతా గొడవగొడవగా వుంది.

యూనిఫారంలో లేనిమనిషి ఎవడో - లోపలికొచ్చేస్తున్నాడని భయం చేతో, ఆందోళనచేతనో అక్కడ కుర్చీలో కూర్చునున్న అధికారి లేచి నిలబడ్డాడు. "ఎవరండి, బాబూ; మీరు; అలా లోపల కొచ్చేత్నారు!" అన్నాడు.

"ఎక్సూజ్మీ; ఇక్కడ కె.సూర్యనారాయణ: కండక్టర్ ఎవరు? బాడ్జీ నెంబరు 7619...."

"ఆయనా? ఎస్సార్ ఇచ్చేసి ఎలిపోయేడండి. సాయంకాలం ఆరున్నర కొత్తాడండి. ఎడ్కోటర్స్ ఐద్రాబేడండి."

"అలాగా, సారీ!" అని యివతలి కొచ్చాను.

నాలో - మనిషీ - పెద్దమనిషీ; ఒకళు చెప్పేదొకళు వినిపించుకోకుండా, పట్టించుకోకుండా ఘర్షణ పడుతున్నారు...." పాపం - ఎక్కడికి పోయేడో! ఎక్కడికి పోతాడు, రిక్షాకైనా డబ్బుల్లేవు!- రాజేశ్వరి ఇల్లు దగ్గిరేనేమో; నడిచి వెళిపోయుంటాడు.....డబ్బులు తేలేదని మొహం మీదుమ్మేసి తరిమేసుంటుంది.... భోజనం ఎకౌంటు దీంట్లో లేదు. అంచేత భోజనం పెట్టే పంపిస్తుంది.... ఆ ఐదు రూపాయల్లోనే అన్నీ వున్నాయేమో?.... భోజనం పెట్టదు.... పెడుతుంది.... పెట్టదు.... పెడుతుంది..... అయితే అలాగని దానెడ్రస్ కనుక్కొని వెళ్లాలా? దండగ... మరి లైసెన్సో?

బెస్టేంటంటే గురూ, ఈ లైసెన్సు ఆ ఆఫీసర్కి హేండోవరు చేసేసి ఈ డబ్బులు కర్చుపెట్టి ఆ పర్స్ రిజిష్టర్ పార్సెల్లో సూన్నారాయణకి పంపించీడమే....

ఎడ్రస్సో?

ఎడ్రస్కేముంది? కె.సూర్యనారాయణ, కండక్టరు, బేడ్జీనెంబరు 7619, గౌలిగుడా బస్సుడిపో, హైద్రాబాదు -

లైసెన్సు హేండోవరు చెయ్యడానికి లోపలికి మళ్లీ వెళ్తే; "ఇది అతని జేబులో భద్రంగా వుండాల్సిన ముఖ్యమైన కాగితం కదా; మీకెలా గొచ్చింది? ఆయన పారేసుకున్నాడా; లేక మీరే ఆయన జేబుకొట్టేశారా? ఆ పర్స్లో ఇంకేంటేంటున్నాయి? మీ పేరేంటి? మీ యడ్రస్సేంటి. డూటీలో వున్నటువంటి కండక్టరు యొక్క లైసెన్సు మీ దగ్గిరికి చేరినందుకు మీ సమాధానం ఏంటి? రండి, పోలీస్టేషనికి; స్టేట్మెంట్ యిచ్చి వెల్దురుగాని" - అని గాని తగులుకున్నాడంటే ఇవాల్టికింక ఇంటికీ వెళ్లలేను; ఈ ఏడాదంతా పోలీస్స్టేషన్కో కోర్టుకో తిరుగుతూ వుండాలి కూడాను. కాల్లో ముల్లు తీసి కంట్లో గుచ్చుకున్నట్టే.

❖ ❖ ❖

పోస్టాఫీసుకెళ్లి రిజిస్ట్రేషన్ గుమాస్తా గార్ని అడిగేను. "ఈ పర్స్ రిజిస్టర్డ్ పార్సిల్లో హైద్రాబాద్ పంపాలంటే ఎంతవుతుంది?"

'ఇది ఇలా పంపకూడదండీ. దీన్ని గుడ్డసంచీలో పాకింగ్ జేసి - కుట్లు కుట్టి - కుట్లేసిన లైను మీద లక్క సీల్లెయ్యాలి. గుడ్డని కొద్దిగా తడిజేసి వైలెట్ పెన్సిల్తో ఆ అడ్రసూ మీ అడ్రసూ రాసి తీసుకురండి. పర్స్ కనక; ఇన్షూరు చేసి పంపడం మంచిదండి.'

"ఆ పేకింగ్ ఎవరు చేస్తారు? నాకు రాదే!"

'మా ఆఫీస్ ప్యూన్ చేసేస్తాడండి. పేకింగు, కుట్లు, లక్కసీళ్లు అన్నీ పడకబందీగా చేస్తాడు.'

"పడకబందీ అంటే మీ ఉద్దేశం పకడ్ బందీ అనేకదా? అఁహాఁ. వెనకటికి మా కాంతారావు గారు క్రిష్టస్వామి రెండోపెళ్లాం పడకబందీగా వుందన్నారులెండి."

నా జోక్కి అతనూ నవ్వేడు.

"అలా పేకింగ్ చేసినందుకు ఎంత పుచ్చుకుంటాడు?"

"పదిహేను రూపాయలండి. ఆపైని పోస్టేజి పదకొండు రూపాయలవుతుంది. ఎకనాలెడ్జిమెంటు కావాలంటే మరో రూపాయి ఎగ్స్ట్రా."

... ... మొత్తం ఇరవై ఆరు రూపాయల ఖర్చు... అంటే, పర్స్ దొరికినందుకు జరిమానా పదమూడున్నర. అస్సలు కిట్టుబాటుగా లేదు, వ్యవహారం.

సరుకంతా తీసేసి, పర్సున్నూ దాంట్లో వున్న ఇంకో చిన్న పాకెట్టున్నూ లింగంగుంట్ల కాలవలో విసిరేశాను. ఇంటికెళ్లి ఒక మామూలు కవర్‌లో ఆ లైసెన్సూ, ఎకౌంటు చీటీ, ఒక ఐదు రూపాయల నోటూ పెట్టి -

మర్నాడు - రిజిస్టర్డ్ పోస్టులో ఆ.కవర్ని కె.సూర్యనారాయణ గారి అడ్రస్‌కి పంపేశాను. ఉత్తరోత్రా తగూ తంటా రాకుండా ఫ్రమ్ అడ్రస్ చేతికొచ్చిందేదో రాసేను.

ఎనిమిది రూపాయలైంది.

❖ ❖ ❖

సూర్యనారాయణ రిటర్న్ ట్రిప్పులో హైదరాబాదు వెళ్తున్నప్పుడు ఏ మాచర్ల దగ్గిరో మల్లేపల్లి దగ్గిరో స్క్వాడ్ వాళ్లు బస్సాపి "నీ కండక్టర్ లైసెన్సేదీ?" అని అడక్కుండా వుండాలని ముక్కోటి దేవతల్ని కాదు గాని మూడు మతాల దేవుళ్లని ప్రార్థించేను.

అందింది కదండీ, సూర్నారాయణగారూ!

మరే - ఈసారి మీరు పర్స్ ఏదైనా పారేసుకునేటప్పుడు మీ లైసెన్స్ మాత్రం అందులో వుంచకండి. మీకూ నాకూ రాజేశ్వరికీ మాత్రమే తెలిసిన ఆ పసుప్పచ్చటి పల్చటి పేకెట్ కూడా వొద్దు. వీలైతే కేష్ మాత్రం మరికొంచెం ఎక్కువగా వుంచండి.

థాంక్స్ సూర్నారాయణగారూ; ఉంటాను!

*("రచన" మాసపత్రిక : దీపావళి 96)*